# పాత జ్ఞాపకాలు

## (జయకాంతన్ కథ)

### అనువాదకుని ముందుమాట

ఈ కథలో అరవైఐదేళ్ళు దాటిన ఇద్దరు మగవాళ్ళు - మిత్రులు - నలభైఐదు సంవత్సరాల ఎడబాటు తరువాత, అకస్మాత్తుగా, కలుసుకుంటారు. ఆ రెండు పాత్రల అన్వేషణలో మనం చూసే ధోరణి, వైఖరి, తీరు ఎంత కొత్తగా కనిపిస్తున్నాయి! వృద్ధాప్యంలే కనబడే లక్షణావలక్షణాలు ఎన్ని రకాలు!

జయకాంతన్ ఈ కథని 1968లో 'ఆనంద వికటన్' పత్రికలో రాసారు; అప్పుడతనికి ముప్పైఐదు కూడా నిండలేదు. అప్పుడే వయసు చెల్లినవారి జీవితశైలిలో దాగియున్న పరిమాణాలని అతను పరిజ్ఞానంతో వెల్లడిచేసే తీరు, అవగాహన మెచ్చుకోతగ్గవి.

ఈ కథలో వచ్చే రంగమణి ఒక అపూర్వమైన పాత్ర. అటువంటి మనిషిని కలుసుకుంటే మనకెలావుంటుంది? అసహ్యమేస్తుందా? 'వీడెవటో ఒక old dirty man లాగ కనిపిస్తున్నాడే?,' అనే ఏవగింపు కలుగుతుందా? నాకూ మొట్టమొదట అలాగే తోచింది. నా పక్షపాతం కొంచెం పక్కన నెట్టి ఈ కథ చాలా సార్లు చదివాను; రంగమణి ఒక multi-faceted character అని తెలుసుకున్నాను. Charles Colt అనే రచయిత అన్నారుగా, 'Man is an embodied paradox, a bundle of contradictions, అని?. అది ఎంత వాస్తవమని మనకి రంగమణి పాత్ర చెప్తోంది. రంగమణిలోనూ, మానవత్వం, కనికరం ఉన్నాయని గ్రహిస్తే మనం అతన్ని బాగా అర్థం చేసుకోగలం. చివరికి శర్మగారు కూడా విముఖంగా ఆ నిజాన్నే గ్రహించారు; తన జీవితమంతా ఒక అబద్ధమేమో అనే ప్రశ్న అతని మనసులో రంగమణిని కలుసుకున్న తరువాతే తోచింది. నిమ్మళంగా తన Comfort Zone ని వదలడానికి ఇష్టం లేకనే శర్మ తిరిగి రంగమణిని బీచులో కలుసుకోలేదని మనకి అర్థమౌతుంది.

*"కాచుకోనీ! . . . . ఎవరు కాచుకొని ఉండలేదు?"*

ఇద్దరి పాత్రల మనోభావాలని ఈ ఆఖరి వాక్యం నిరూపించుతోంది. వృద్ధాప్యంలో ఇద్దరూ 'కాచుకోనే' ఉన్నారు. కాని అందులో ఎంత భిన్నత్వం! అనంత శర్మకి 'సరే, అంతా ఐపోయింది,' అనే మౌనాంగీకారం; 'నాకోసం రోజు ఒక కొత్త పువ్వు పూస్తోంది' అని రంగమణి చింతన.

జయకాతన్ రాసిన మరి కొన్ని కథల్లాగ 'పాత జ్ఞాపకాలు' కూడా వివాదాస్పదమైనది. "ఇలాంటి కథలు చదివితే మా పిల్లలు ఏమవుతారు?" అని కొందరు పాఠకులు మొరబెట్టుకున్నారట. వాళ్ళకి జయకాంతన్ చెప్పనది ఇదే: "వాళ్ళెవరూ నా కథలు చదవనక్కరలేదు. ఐతే, నా కథలు పెద్దవారుమాత్రమే చదవాలని నేనను. వయసులోకాదు, మనసులో పక్వముంటేనే నా కథలు బోధపడతాయి," అని అన్నారు.

ఈ కథను త్రీవ్రంగా ఖండించినవారు రచయిత సహృదయ కమ్యూనిస్టు మిత్రులని చెప్పాలి. రంగమణి పాత్రలో కనిపించే వ్యక్తిగత మనోబావం (Individualism, అది కమ్యూనిస్టు విధినియమానికి వ్యతిరికం) వాళ్ళకి కటువుగా అనిపించింది. బాల్యంనుండే జయకాతన్ కమ్యూవిస్టు వాతాపరణంలో పెరిగారు; తన్ను కమ్యూనిస్టు రచయత అని గర్వంగా చెప్పుకునేవారు. అటువంటి గొప్ప Leftist రచయత 'పాత జ్ఞాపకాలు' రాయడంతో తోవతప్పారా అని వాళ్ళకి అనుమానం కలిగింది. "మన దేశంలో, చాలా అన్యాయాలూ, ఘోరాలూ దినసరి జరుగుతున్నాయి. కొన్ని రోజులముందు తంజావూరులో, ఒక గ్రామంలో హరిజనులను ఒక గుడిసెలో బంధించి కాల్చేసారు. వాళ్ళగురించి జయకాంతన్ రాయరేం? అది వదిలేసి ఎవడో ముసలాటికి అనుకూలంగా వాదిస్తే కమ్యూనిస్టు అభ్యుదయ భావాలు వ్యాపించడం ఎలాగ?" అని వారి వాదన.

దానికి జయకాంతన్ ఇచ్చిన ప్రత్యుత్తరం ఇది:

"నేను రచయితని కాబట్టి ఏది రాయాలో నిర్ణయించేది నేనేగాని మరెవరో కాదు. నేనింతవరకూ ఆ హరిజనులగురించి రాయలేదు; భవిష్యత్తులో రాస్తానేమో, నాకు తెలియదు. ఐతే, నేను రాసినదేమో విమర్శించకుండా, నేను రాయని విషయాలపై చర్చలు కొనసాగిడంలో ఏమైనా అర్థముందా?" అని అతను ఎదురుప్రశ్న వేసారు.



జూన్ - జూలై, 2000లో జయకాంతన్ ఒక తమిళ సాహితీ సమ్మేళనంకోసం అమెరికాకి వచ్చినప్పుడు San Jose లో ఒక ఉపన్యాసంలో కలుసుకున్నారు. అప్పుడు నేనతన్ని అడిగాను. "మనం చూసే వ్యక్తులెవరూ రంగమణిలాగ ఉండరు. ఆ పాత్ర పూర్తిగా మీరు మీ కల్పనలో సృష్టించారా? లేకపోతే మీకు అటువంటి మనుషులతో ఏమైనా పరిచయముందా?" అని అడిగాను.

జయకాంతన్ సూటిగా నా ప్రశ్నకి బదులు చెప్పలేదు. "నేను సృష్టించిన పాత్రలని నేను నా పాఠకులకే వదిలేస్తాను. వాళ్ళు వాటిగురించి మాటాడనీ, విమర్శించనీ. నేను మరేం చెప్పదలచుకోలేదు. మీరన్నట్టే నేను సృష్టించిన పాత్రలన్నీ కల్పనలని, వాస్తవంగా ఎక్కడా కనిపించవని కొందరనడం నాకు తెలుసు. నా పాత్రలు మన పురాణగాధలలో, ఇతిహాసాల్లోని వచ్చే పాత్రలలాగ. అవి సాంకేతిక బాషలోనే మనకి వ్యక్తమవుతాయి," అని అన్నారు.

ఈ కథని అనువదించడానికి అనుమతి ఇచ్చిన జయకాంతన్ కొమార్తె దీపలక్షిగారికి నా కృతజ్ఞతలు.

El Cerrito, CA ఏండి సుందరేశన్
May 20, 2016